## క్లుప్తంగా...

### ట్రాఫిక్ బ్లింకర్స్‌ను ప్రారంభించిన ఏసీపీ వెంకట్‌రెడ్డి



బ్లింకర్స్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్: 44వ జాతీయ రహదారిపై పట్టణ పరిధిలో ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బ్లింకర్స్‌ను మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ప్రమాదాల నివారణకు ఐటీఐ వద్ద గల యూటర్న్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశారు. వాటిని ఏసీపీ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి, కౌన్సిలర్ జాకట దేవ, సీఐలు నర్సింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

### శామీర్‌పేట పీఎస్ తాత్కాలిక సీఐగా రాజగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ తాత్కాలిక సీఐగా జినోమ్‌వ్యాలీ సీఐ రాజగోపాల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. శామీర్‌పేట సీఐగా బాధ్యతలు నిర్వహించిన సుధీర్‌కుమార్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగా ఎలాంటి ఆర్డర్స్ అందలేదని తెలిపారు.

### నూతన సీఐకి సత్కారం



మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ నూతన సీఐ మహేందర్‌రెడ్డిని, బదిలీ అయిన సీఐ అశోక్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకట్‌రెడ్డి, యాదగిరి, ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, సరళ, వినోద, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, ముత్యాలు యాదవ్, ఆంజనేయులుయాదవ్, సత్తిరెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున పాల్గొన్నారు.

### యమ్నంపేట్‌లో పోచారం ఐటీ కారిడార్ పీఎస్


పోచారం: కొత్తగా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌ను యమ్నంపేట్‌లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. అందుకు అవసరమైన పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే స్టేషన్‌కు కావాల్సిన సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. సీఐగా వి.అశోక్‌రెడ్డి నియమితులయ్యారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి కార్యకలాపాలు నిర్వహించనున్నారు. పోచారం ఠాణా పరిధిలో పోచారం, యమ్నంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, అన్నోజిగూడ, కొర్రెముల, వెంకటాపూర్, చౌదరిగూడ, పకీర్‌టెక్యా ప్రాంతాలను చేర్చారు. ఈ ప్రాంతాలన్నీ ఇప్పటి వరకు ఘట్‌కేసర్ ఠాణా పరిధిలో ఉండేవి. ఇకపై ఈ ప్రాంతాల ప్రజలు పోచారం ఠాణా సేవలను వినియోగించుకోవాలి.

### ఉచితంగా కంటి ఆపరేషన్లు



కీసర: తిమ్మాయిపల్లి గ్రామంలో కంటి వెలుగులో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించేందుకు మంగళవారం గ్రామసర్పంచ్ పెంటయ్య ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ఆసుపత్రిలో గ్రామానికి చెందిన వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్



ఘట్‌కేసర్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని, నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# తూతూమంత్రంగా..

- మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం
- గైర్హాజరైన సర్పంచ్‌లు, అధికారులు
- సమావేశంలో ఖాళీ కుర్చీలే ఎక్కువ
- హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



సమావేశంలో ఎంపీపీ, తదితరులు

మేడ్చల్: ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పెద్దగా చర్చలు లేకుండానే ముగిసింది. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలు, ప్రజల ఇబ్బందులు, అధికారుల పనితీరు వంటి విషయాలపై మండల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించే మండల పరిషత్ సమావేశం చప్పగా సాగింది. ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పెద్దగా ఆసక్తికర చర్చలు లేకుండా సమావేశాన్ని ముగించేశారు. సమావేశానికి 17 మంది సర్పంచ్‌ల్లో ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఒకటి రెండు శాఖల అధికారులు మినహా మిగతా శాఖల ద్వితీయ శ్రేణి అధికారులు మాత్రమే సమావేశానికి వచ్చారు. తమ శాఖల అభివృద్ధిని వివరించి మమ అనిపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి డుమ్మా కొట్టడటంతో ఖాళీ కుర్చీలే ఎక్కువగా దర్శనమిచ్చాయి.

#### అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం: ఎంపీపీ

సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు లేఖ రాస్తామని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. సమావేశాలకు డుమ్మా కొట్టిన అధికారులను గుర్తించామని, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు వివరిస్తామని చెప్పారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. చాలా శాఖల అధికారులు మండల సమావేశానికి తమ ద్వితీయ శ్రేణి అధికారులను పంపించి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

#### సమావేశంలో చర్చలు..

మండల పరిషత్ సమావేశంలో ఎజెండాలో 25 అంశాలను పొందుపరచగా 17 అంశాలపై చర్చలు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పూడూర్ ఎంపీటీసీ రఘు, డబీల్‌పూర్ సర్పంచ్ గీతభాగ్యారెడ్డి అన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే పనులు చేస్తున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పూడూర్ లైన్‌మెన్ రవినాయక్ గ్రామంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ రఘు డిమాండ్ చేశారు. కోతలు ఎక్కువగా విధించడం వల్ల గ్రామాల్లో ప్రజలకు తాగు నీటిని సరఫరా చేయలేకపోతున్నామని, కోతలు ఉంటే ముందుగానే చెప్పాలని డబీల్‌పూర్ సర్పంచ్ అధికారులను కోరారు.

#### శ్మశానంలో గ్రామ పంచాయతీ పెట్టుకోవాలా?

లింగాపూర్ గ్రామానికి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం మంజూరై మూడేళ్లు గడుస్తున్నా భవనాన్ని నిర్మించడం లేదని గ్రామ సర్పంచ్ లక్ష్మీ సంజీవ అన్నారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం లేకపోతే ఎలా అన్నారు. మూడేళ్ల క్రితం మంజూరైనా భవనాన్ని ఎందుకు నిర్మించలేదని, శ్మశానవాటికను అభివృద్ధి చేశారని, గ్రామ పంచాయతీని శ్మశానంలో పెట్టుకోవాలా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

#### స్కూల్ సమయాల్లో బస్సులు నడపాలి

పాఠశాలలు ప్రారంభం కాగానే వారికి రవాణాలో ఇబ్బందులు లేకుండా బస్సులు స్కూల్ సమయాలలో నడపాలని ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి కోరారు. మేడ్చల్ డిపోలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డీఎం సుధాకర్ సభను కోరారు. సమావేశానికి వచ్చిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎందుకు అధికారులు చెప్పిన విషయాలు వినడం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు శైలజవిజయానంద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలకు రుణాల మంజూరులో కొంతమంది సిబ్బంది కమీషన్లు తీసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రాయిలాపూర్ ఎంపీటీసీ అనుపశ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేం, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు విజయానంద్‌రెడ్డి, డబీల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ సరిత, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గౌస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఖాళీగా కుర్చీలు

# 14న ఘనంగా వైద్యారోగ్య దినోత్సవం

- 13న మహిళా సంక్షేమం, 20న విద్యా దినోత్సవం ఏర్పాట్లపై కసరత్తు
- జిల్లా సమన్వయం సమావేశంలో నిర్ణయం



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై మంగళంవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఐక్యతతో ముందుకు సాగాలని నిర్ణయించారు. సమావేశానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, మహిళా, శిశు అభివృద్ధి, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి అక్కేశ్వర్‌రావు దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై చర్చించి, తగిన సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రాథమిక / పట్టణ ఆరోగ్యకేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాలు, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 14 జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. నియోజకవర్గం స్థాయిలో కేసీఆర్ కిట్, న్యూట్రీషన్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులను ఆహ్వానించి సభ నిర్వహించాలని నిర్ణయించారు. వైద్యరంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించడం ద్వారా ప్రజల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు. మాతా, శిశు సంరక్షణ సేవలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. వైద్య ప్రగతిపై కరపత్రాల పంపిణీతోపాటు రోగులకు పండ్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అలాగే, ఉత్తమ ఆశ వర్కర్, ఏఎన్ఎం, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, డాక్టర్లను ఘనంగా సన్మానించి, అవార్డులు అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 13న మహిళా సంక్షేమ దినోత్సవం, జూన్ 20న తెలంగాణ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

# 'నిరూపిస్తా.. రాజీనామా చేయిస్తా'

25వ డివిజన్ కార్పొరేటర్ నవీన్‌కుమార్

జవహర్‌నగర్: బీఆర్ఎస్ నాయకుడు బల్లి శ్రీనివాస్ సర్వే నెం.226లో కబ్జా చేసినట్లు నిరూపించి 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజాతో రాజీనామా చేయిస్తానని 25వ డివిజన్ కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జవహర్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు బల్లి శ్రీనివాస్ బాగోతాలను వారం రోజుల్లో బయటపెడతానన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను కార్పొరేటర్‌గా ఉన్నా ఇంకా కిరాయి ఇంట్లో జీవిస్తున్నానని, బల్లి శ్రీను ప్రభుత్వ భూములను విక్రయించి కోట్ల రూపాయాలు సంపాదించాడని ఆరోపించారు. సర్వే నెం.226లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు నా వద్దకు వచ్చారని, వారికి న్యాయం చేయాలని తాను వారితో కలిసి స్థలం వద్దకు వెళ్లానన్నారు. బల్లి శ్రీను తన బినామి అయిన వెంకటేష్‌తో తనపై అట్రాసిటీ కేసు పెట్టించాలని ప్రయత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

**రాజీకి యత్నాలు..**

బీఆర్ఎస్, కార్పొరేటర్ల మధ్య కోల్డ్‌వార్ నడుస్తుండటంతో మంత్రి మల్లారెడ్డి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీంతో మంగళవారం సాయంత్రం డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ కొందరు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి రాజీకి యత్నిస్తున్నట్లు తెలిసింది. బహిరంగంగా వచ్చి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేస్తుండటంతో పార్టీకి చెడ్డపేరు వస్తోందని, మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రయత్నిస్తున్నారు.

# రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రైతు వేదికల వద్ద రైతు దినోత్సవ కార్యక్రమంలో రైతులు అందరూ పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన తెలంగాణ గొప్పదనాన్ని రైతులకు చెప్పాలని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో పాటు సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరించాలన్నారు. సంబంధిత అధికారులు రైతు వేదికలను అందంగా అలంకరణ చేయాలని మంత్రి ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్‌ల పరిధిలోని రైతులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ, డీసీఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు నీరజాగాంధీ, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

### నేడు మంత్రి మల్లారెడ్డి పర్యటన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలో బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ హారిక పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. మండల పరిధిలోని పోతారం, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, ఆద్రాస్‌పల్లి, జగ్గంగూడ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభిస్తారని ఎంపీపీ హారిక తెలిపారు.

### కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



శ్రీధర్‌గౌడ్(ఫైల్)

మేడ్చల్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంభ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం పట్టణంలోని కింది బస్తీలో అత్వెల్లి శ్రీధర్‌గౌడ్(34) అనే యువకుడు తమ కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతుండటంతో భరించలేక సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఉదయం వరకు శ్రీధర్‌గౌడ్ తిరిగి రాకపోవడంతో ఆయన ఫోన్ ఆధారంగా వెతకగా పట్టణ శివార్లలోని రైల్వే ట్రాక్ వద్ద సిగ్నల్స్ చూపడంతో అక్కడికి వెళ్లి చూడగా శ్రీధర్‌గౌడ్ మృతదేహం ట్రాక్‌పై పడి ఉంది. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇంట్లో గొడవలతోనే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**విజయపురికాలనీలో మహిళ ఆత్మహత్య**

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని విజయపురికాలనీలో మంగళవారం రాత్రి ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కీసర పోలీసుల వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన నగునూరి రమేష్, విజయలక్ష్మీ దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నాగారం వలసవచ్చారు. భర్త రమేష్ టైలరింగ్ చేస్తుండగా విజయలక్ష్మీ(48) గృహిణి. మంగళవారం రాత్రి ఇంట్లో విజయలక్ష్మీ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

### పది.. వైద్యం ప్రశంసనీయం..

కుషాయిగూడ: కేవలం రూ.10కే వైద్యం అందించడం ప్రశంసనీయమని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని విద్యామారుతీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సిరి అభయ ఆసుపత్రిని మంగళవారం ఆయన నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకగా వైద్యసాయం అందించాలనే సామాజిక భావన గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు.

# అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తాం..





మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: పురపాలక సంఘం సమావేశ మందిరంలో మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై కౌన్సిల్ సభ్యులతో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిల్ సభ్యులు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, ఆకిటి శైలజ, బాలగోని వెంకటేశ్ గౌడ్, బెజ్జంకి హరిప్రసాదరావు, సామల శ్రీలత, బద్దం మమతా రాణి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత



అవుషాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: పెరుగుతున్న జనాభాతో ఏర్పడుతున్న ముప్పు నుంచి పర్యావరణాన్ని రక్షించడం మనందరి బాధ్యత అని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ కావేరి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని రక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాలు పెరగడంతో అడవులు తరుగుతున్నాయని, ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పుతో జంతువులు, పక్షులు క్రమంగా అంతరిస్తున్నాయని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యులు మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు నరసింహ, మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, సలీం, వేమన, సత్యనారాయణ, చింటు పాల్గొన్నారు.

# గురుకుల పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు సంప్రదించాలి

శామీర్‌పేట్: గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు జూన్ 2, 3 తేదీల్లో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ డా.ఇష్రాత్ పత్రిక ప్రకటన ద్వారా మంగళవారం తెలిపారు. జూన్ 2న బీఎస్సీ, బీజెడ్సీ, ఎంజెడ్సీ, ఎంపీసీ ఎంఎస్‌సీఎస్, జూన్ 3న బీకాం కంప్యూటర్స్ గ్రూపుల విద్యార్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలు, పది, ఇంటర్ మెమోలు, టీజీయూజీ సెట్ హాల్‌టికెట్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు 10 పాస్ ఫొటోలతో సంప్రదించాలని సూచించారు.

**గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం**

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని ఇబ్రహీంపట్నం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ హేమమాలిని తెలిపారు. టీజీయూజీసీఈటీ-2023లో అర్హత సాధించిన విద్యార్థినులు జూన్ 2న ఉదయం 9.30 గంటలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అన్ని గ్రూపుల్లో చేరడానికి పది, ఇంటర్, మెమోలు, టీజీయూజీ సెట్ ర్యాంకు కార్డు, కుల, ఆదాయం, బోనాఫైడ్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, 10 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు.

### 'ప్రభుత్వ స్థలంలో మాయమైన క్రీడా మైదానం బోర్డు'

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో ప్రభుత్వం అలాట్‌మెంట్ చేసిన ఆట స్థలాన్ని బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో క్రీడా మైదానం కోసం సంవత్సరం క్రితం అధికారికంగా స్థలం అలాట్‌మెంట్ ప్రకటించి బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఆ బోర్డు కనిపించడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమల్, సునీల్, సన్నీ, మహేష్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, బుజ్జి, శివ, రాజునాయక్, శ్రీనివాస్, ప్రశాంత్, ఇలయ్ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించింది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 100 డయల్ కాల్‌తో స్థానిక పోలీస్ మొబైల్ వ్యాన్ పోలీసులు పోచారం మున్సిపల్ అన్నోజిగూడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్దకు వెళ్లిచూడగా ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో కనిపించడంతో వారు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. స్థానికంగా విచారించగా సమీప ప్రాంతాల్లో ఉండే యాచకుడని తెలిసింది. అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# సంబురాలు అంబరాన్నంటాలి

ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: తెలంగాణ ఖ్యాతి నలుదిశలా తెలిసేలా సంబురాలు ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో చైర్ పర్సన్ అధ్యక్షన మంగళవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్ల పూర్తి చేసుకొని పదో సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా జూన్ 2-22 వరకు ప్రభుత్వ సూచనల మేరకు నిర్వహిస్తున్న సంబురాలు అంబరాన్నంటాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని, తెలంగాణ అభివృద్ధిని చూసి ఉత్తరాది రాష్ట్రాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు సంగీత, అనురాధ, నాగజ్యోతి, మల్లేశ్, జహంగీర్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, బి.అరుణ, షౌకత్, పి.అరుణ, మేనేజర్ అంజిరెడ్డి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో ఇటీవల మరణించిన మృతులకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామంలో మృతి చెందిన శోభ, కిష్టయ్య కుటుంబ సభ్యులను టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, రైతు బంధు జిల్లా సభ్యుడు భిక్షపతి ఆధ్వర్యంలో బాధితుల ఇంటికెళ్లి మంగళవారం పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశ్, మల్లారెడ్డి ట్రస్ట్ ప్రతినిధి వేణు, నాగరాజు పాల్గొన్నారు.

### వేద పండితులకు గౌరవ డాక్టరేట్స్



చట్టిపెద్ది రామ్‌కుమార్‌శర్మకు..



ఆర్.శివకార్తీక్ శాస్త్రీకి..

కీసర: నాగారం మున్సిపాలిటీకి చెందిన వేద పండితులకు తమిళనాడుకు చెందిన ఏసీయా ఇంటర్నేషనల్ కల్చరర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగారం ప్రాంతానికి చెందిన వేదపండితులు బ్రహ్మశ్రీ చెట్టిపెద్దిరామ్ కుమార్‌శర్మకు జ్యోతిషం(ఆస్ట్రాలజీ)లో చేసిన సేవలకు, మరో వేదపండితులు బ్రహ్మశ్రీ ఆర్.శివకార్తీక్ శాస్త్రీకి జ్యోతిషంలో(ఆస్ట్రాలజీ)లో సేవలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి గౌరవ డాక్టరేట్ పొందిన పెద్దిరామ్‌కుమార్‌శర్మను ఘనంగా సత్కరించారు.